క్లుప్తంగా

ప్రపంచ తెలుగు మహాసభలకు పద్యకవి నర్సింలు



లింగంపేట(ఎల్లారెడ్డి): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరుగుతున్న ప్రపంచ 6వ తెలుగు మహాసభలకు లింగంపేట మండలం కోర్పోల్ గ్రామానికి చెందిన తెలుగు భాష ఉపాధ్యాయుడు గాండ్ల నర్సింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాసభలకు కామారెడ్డి జిల్లా నుంచి ఐదుగురు కవులకు ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి తనకు తెలుగు పద్య కవిగా ఆహ్వానం రావడంతో ప్రతినిధిగా హాజరైనట్లు తెలిపారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారం



రాజంపేట: ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఈ దారిలో పోవాలంటే ముక్కు మూసుకోవాల్సిందే' అనే కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఎంపీడీవోరఘురాం, పంచాయతీ కార్యదర్శి అశోక్ దగ్గర ఉండి ఎస్‌బీఐ ఎదుట ఉన్న మురికి నీరు శుభ్రం చేయించారు. సంబంధిత భవన యజమానికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

పంట కాలువలో పూడికతీత



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం నర్వ శివారులో సింగితం రిజర్వాయర్ పంట కాలువలో పూడిక మట్టిని పొక్లెయిన్ సాయంతో శుభ్రం చేశారు. పంట కాలువ శిథిలావస్థకు చేరుకొని సైడ్ వాల్ కూలడంతో పాటు మట్టి పేరుకుపోయింది. రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసినా ఆయకట్టుకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొంది. దాంతో ఆయకట్టు ప్రాంత రైతులు ఎకరానికి రూ. వెయ్యి చొప్పున విరాళాలను సేకరించి పంట కాలువలో పూడికతీత చేయించుకున్నారు.

కస్తూర్బా వద్ద ఉద్యోగుల నిరసన



నిజాంసాగర్(జుక్కల్): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రత్యేక అధికారులను నియమించడంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు, కస్తూర్బా సిబ్బంది నిరసన తెలిపారు. ఆదివారం మండలం కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం గేటు ముందు ఉద్యోగులు, సిబ్బంది బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులు 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కారం దిశగా అడుగులు వేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఎంఈవోలు అమర్ సింగ్, తిరుపతిరెడ్డి, కస్తూర్బా ఇన్‌చార్జి స్పెషల్ అధికారిణి సమత, సీఆర్పీలు శంకర్‌గౌడ్, సాయిరాం, వెంకట్రాంగౌడ్, కస్తూర్బా టీచర్లు సరిత, రజిత, రమాదేవి, వర్షిణి తదితరులున్నారు.

సీఎం కప్ పోటీలకు పోసానిపేట్ విద్యార్థినులు



రామారెడ్డి: వరంగల్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(పోసానిపేట్) విద్యార్థినులు నేహ, నిహారిక, మేఘన, రుతిక, రసజ్ఞలు ఎంపికయ్యారని పీఈటీ నరేష్‌రెడ్డి తెలిపారు. జిల్లా బాలికల జట్టుకు కెప్టెన్‌గా నేహ, కోచ్‌గా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నరేష్ రెడ్డి వ్యవహరిస్తారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పేర్కొన్నారు.

పాల్వంచ విద్యార్థులు..



మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గోవర్ధన్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఖోఖోతో పాటు వివిధ క్రీడా పోటీలకు 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు.

ధర్మారావుపేట్ పాఠశాల విద్యార్థిని..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావుపేట్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.అలేఖ్య సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీడీ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో యోసెఫ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 31 నుంచి వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కామారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినిని గ్రామస్తులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.

తప్పించుకున్న వాహనాల జాడేది?

- కాసుల కోసం వదిలేశారని ఆరోపణలు
- దుర్కిలో జేసీబీ, టిప్పర్ తప్పించుకోవడం వెనుక అధికారుల హస్తం
- ఫిర్యాదు చేసినా ముందుకు జరగని కేసు



దుర్కిలో మొరం రవాణాకు ఉపయోగించిన జేసీబీ, టిప్పర్ (ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ): అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి శివారు అటవీ భూమిలో ఈ నెల 26న జేసీబీ, టిప్పర్‌లను పట్టుకున్నారు. అయితే అధికారుల కన్నుగప్పి మొరం మాఫియా టిప్పర్, జేసీబీతో తప్పించుకున్నారని గిర్దావర్ సాయిలు చెబుతున్నారు. పట్టుకున్న వాహనాలు, వాహన డ్రైవర్లు అధికారుల సహకారంతోనే తప్పించుకున్నట్లు మండలంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటనా స్థలంలో గిర్దావర్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది ఉండగా వివరాలను నమోదు చేసుకున్నాక తప్పించుకోవడంపై పలు అనుమానాలు వినిపిస్తున్నాయి. టిప్పర్ నెంబరు, డ్రైవర్ ఫోన్ నెంబరు సైతం రెవెన్యూ అధికారుల దగ్గర ఉండగా కూడా ఇప్పటికీ వాహనాల జాడ దొరకడం లేదు. ఫోన్ పోతే నిమిషాల్లో పట్టుకునే పోలీసులు ప్రభుత్వ ఆస్తులు, వనరులు కొల్లగొట్టి దర్జాగా తప్పించుకుంటే ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యంతో పాటు వారి హస్తం కూడా ఉన్నట్లు కనబడుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించొచ్చు

- శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఐకమత్యమే బలం, కలిసి ఉంటే ఏదైనా సాధించవచ్చని ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. అబ్దుల్లా నగర్ శివారులో పైడి ఎల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆర్య వైశ్య బంధుమిత్ర ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సామాజిక సేవ చేయాలనే ఉద్దేశంతో 25 సంవత్సరాల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలను చేశానన్నారు. కామారెడ్డి జిల్లాలో వందకు పైగా గ్రామాలలో వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా ఎలాంటి సమస్యలున్నా తనకు తెలియజేసినట్లయితే తన వంతు సహాయాన్ని అందిస్తానన్నారు. మహానుభావులు గాంధీ మహాత్ముడు, పొట్టి శ్రీరాములు, రోశయ్య, జ్యోతిబసు, ప్రకాశం పంతులు ఆర్యవైశ్య కులానికి చెందినవారేనని గుర్తు చేశారు. తాడ్వాయి మండలంలో ఆర్యవైశ్య సంఘం భవనం నిర్మాణానికి తన వంతు సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కులస్తులు పైడి ఎల్లారెడ్డిని సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు గంగాశరణ్, కిశోర్, రాజు, వేణు గోపాల్, శశిబాబు, రాములు, భాస్కర్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఆర్యవైశ్య కులస్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కామారెడ్డి క్రైం: ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ సూచించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనుమతి లేని ప్రదేశాలు, హోటళ్లు, దాబాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో పార్టీలు పెట్టుకుంటే తప్పనిసరిగా ఎక్సైజ్ అధికారులను సంప్రదించి అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనల అమలుపై పర్యవేక్షించడం కోసం జిల్లాలో 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేసుల్లో పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మకర సంధ్య పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంజనేయ శర్మ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీసంకష్టహర గణపతి ఆలయం విశిష్టతను తెలియజేస్తూ ప్రచురించిన మకర సంధ్య పుస్తకాన్ని ఆదివారం ఆలయంలో వేదపండితులు జి. ఆంజనేయ శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చకులు యజ్ఞం సంపత్‌శర్మ, శరణ్‌దాస్, సుతారి అంజయ్య, బి.రవి. విశ్వంగుప్తా, పిట్ల సాయిలు, యెంబరి లింగం తదితరులు పాల్గొన్నారు.

సమర శంఖారావం వాల్‌పోస్టర్లు..

కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జనవరి 8న జరిగే బీసీ విద్యార్థుల సమర శంఖారావానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు మాట్లాడుతూ..గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకులాలు, వసతిగృహాలలో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి సాయి గౌడ్, నాయకులు శ్రీనివాస్, హరి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం నేతాజీ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంబల్ల సతీష్, ఉపాధ్యక్షులుగా ముదాం దత్తు, సాకలి చందు, ప్రధాన కార్యదర్శిగా గొల్ల లక్ష్మణ్, కోశాధికారిగా తానయ్యోల శ్రీకాంత్‌రావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవులు, మాజీ వైస్ ఎంపీపీ నర్సిములు, వీడీసీ చైర్మన్ మేకల రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సత్యసాయి బాలవికాస్ కార్యక్రమం



కామారెడ్డి అర్బన్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఆదివారం శ్రీసత్యసాయి బాలవికాస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవాసమితి పట్టణ ప్రతినిధి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సరంపల్లి పాఠశాలలో సత్యసాయి భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలి



బాన్సువాడ : ప్రతి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు మైశయ్య అన్నారు. ఆదివారం కాద్లాపూర్, సంగోజీపేట్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. అంబేడ్కర్ సంఘం నాయకులు నర్రె నర్సింలు, గంగారం, మన్నె చిన్న సాయిలు, బేగరి సాయిలు, న్యాలకంటి గంగాధర్, తదితరులున్నారు.

రేషన్ డీలర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ జాల రవీందర్ రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా ఆదివారం కామారెడ్డి జిల్లా రేషన్ డీలర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లద్దూరి లక్ష్మీపతి యాదవ్, డీలర్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆయన వెంట సంగం కామారెడ్డి డివిజన్ అధ్యక్షుడు ముత్యపు సిద్దరాములు, దోమకొండ మండల అధ్యక్షుడు ఆశంశెట్టి పోచయ్య, ప్రధాన కార్యదర్శి మన్నె మల్లారెడ్డి, రేషన్ డీలర్లు సంతోష్ కుమార్, అబ్రబోయిన రాజేందర్, చిలక నరేష్, అబ్రబోయిన రాము, గొర్ల రాజు, కర్రే శ్యాం కుమార్, తదితరులు ఉన్నారు.

బిచ్కుందలో ప్రజావాణి

బిచ్కుంద(జుక్కల్): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జుక్కల్ నియోజకవర్గ ప్రజల కోసం సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించడానికి బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హాజరవుతున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి రావడానికి నియోజకవర్గ ప్రజలు గ్రామాల నుంచి రవాణా సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని.. ప్రజల సౌకర్యార్థం సోమవారం బిచ్కుందలో ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నిరసన కార్యక్రమాలు చేపట్టాలి

కామారెడ్డి టౌన్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ హైస్కూల్‌లో దళిత హెచ్‌ఎం రాములుపై దాడికి నిరసనగా నేడు(సోమవారం) అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంగల వెంకట్, చవాన్ సుభాన్ సింగ్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భోజన విరామ సమయంలో పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దాడి చేయడమే కాకుండా ఓ విద్యార్థి కాళ్లు మొక్కిచ్చిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఒక తడితో కూడా అధిక దిగుబడులు

మద్నూర్(జుక్కల్): మండలంలో పండించే శనగ పంటకు ఒక తడి నీరు పెడితే కూడా అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం శనగ పంట పూత, ఖాత దశకు వస్తోందని ఈ సమయంలో రైతులు పంటకు నీరు పెడితే ఎకరానికి ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించవచ్చన్నారు. రైతులు పూత, కాత సమయాల్లో రెండు సార్లు నీరు పెడితే దిగుబడులు బాగా వస్తాయని, బోర్లు ఉన్న రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలని కోరారు.

డీఎస్పీ నాయకుల దీక్ష భగ్నం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు మూడు రోజులుగా చేపడుతున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకుల దీక్షను ఆదివారం పోలీసులు భగ్నం చేశారు. నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ మాట్లాడుతూ.. పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తమ దీక్షను భగ్నం చేసినా లక్ష్యాన్ని ఆపలేరని, భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు లక్ష్మణ్, రాజు, సత్యం, రాజు, కవిన్, రాజశేఖర్, రాజు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఎంఈవో కుటుంబానికి చేయూత



మాచారెడ్డి: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన పాల్వంచ మండల విద్యాధికారి జెతాలాల్ కుటుంబ సభ్యులకు ఆదివారం పీఆర్టీయూ నాయకులు రూ.లక్ష అందజేసి చేయూతనిచ్చారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షు డు కుషాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, రూప్ సింగ్, మండల శాఖ అధ్యక్షుడు బాల్‌రాజు, కార్యదర్శి అంతయ్య ఉన్నారు.

'బేడ బుడగ జంగాలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి'



కామారెడ్డి అర్బన్: బేడ బుడగ జంగాలు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని, తొలి ప్రాధాన్యత విద్యకు ఇవ్వాలని, ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు, టీఎస్‌జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు విభూతి సాయిలు అన్నారు. ఆదివారం స్థానిక సాందీపని కళాశాలలో సంఘం జిల్లా సమావేశం జరిగింది. సమావేశంలో 57 ఎస్సీ ఉపకులాల ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పస్తం పరుశురామ్ ప్రస్తుత సమాజంలో సవాళ్లను ఎలా అధిగమించాలో వివరించారు. సంఘం ప్రతినిధులు తిరుపతి, రాజు, వెంకటి, అల్లం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంఘం జిల్లా కార్యవర్గం

బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొండపల్లి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా సంకు పోచయ్య, కోశాధికారిగా పానకంటి నారాయణ ఎన్నికయ్యారు. యువత జిల్లా అధ్యక్షుడుగా ఒంటెద్దు సంఘమేష్, ప్రధాన కార్యదర్శిగా కల్లెం రవి, కోశాధికారిగా ఇప్ప నవీన్‌లను ఎన్నుకున్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి



రామారెడ్డిలో బూత్ కమిటీ సభ్యులతో లక్ష్మారెడ్డి



దోమకొండ మండలం గొట్టిముక్కులలో..



యాదారంలో..

– బీజేపీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి

రామారెడ్డి: క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. రెడ్డిపేటలో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం 3వ బూత్ అధ్యక్షుడిగా సాయిలు, 4వ బూత్ అధ్యక్షుడిగా శంకర్, 5వ బూత్ అధ్యక్షుడిగా ముదాం లింబాద్రి, 6వ బూత్ అధ్యక్షుడిగా నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దోమకొండ: సంస్థాగత మార్పుల్లో భాగంగా గొట్టిముక్కుల గ్రామంలో 104వ బూత్ అధ్యక్షుడిగా యష్పాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జగదీష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: యాదారం గ్రామంలో బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. 60వ బూత్ అధ్యక్షుడిగా మామిడి రమేష్, 62వ బూత్ అధ్యక్షుడిగా మహేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్‌గౌడ్, నక్కరాజు, దేవారాజు గౌడ్, పోసు శివ, ప్రవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడంలో నిర్లక్ష్యం



భిక్కనూరులో మాట్లాడుతున్న ఏబీవీపీ నేతలు

భిక్కనూరు: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏబీవీపీ జిల్లా కార్యవర్గసభ్యుడు సమీర్‌ఖాన్ విమర్శించారు. ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడం లేదని, ఏడాది కాలంలో 49 మంది విద్యార్థులు చనిపోయినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని మండిపడ్డారు. గురుకులాల్లో పరిస్థితి ఏమాత్రం బాగా లేకున్న ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నా పదవ తరగతి అర్ధాకలితో సతమతమవుతున్నారన్నారు. వెంటనే వారికి అల్పాహారం లేదా స్నాక్స్‌ను అందజేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నేతలు రాజేందర్, యోగేష్, సందీప్ పాల్గొన్నారు.

పట్టణ జనరల్ స్టోర్స్, బుక్‌సెల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గం



అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు



మున్నూరుకాపు సంఘ కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి అర్బన్: పట్టణ జనరల్ స్టోర్స్, బుక్ సెల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్మ శ్రీనివాస్(గణేష్ బుక్ సెల్లర్స్), ప్రధాన కార్యదర్శిగా గంప సుధాకర్(తిరుమల బుక్ సెల్లర్స్), కోశాధికారిగా గంప ప్రసాద్ (కృష్ణప్రసాద్ బుక్ సెల్లర్స్)లు ఎన్నికయ్యారు. కార్యవర్గం రెండేళ్ల కాలం కొనసాగుతుందని అధ్యక్షుడు కొమ్మ శ్రీనివాస్ పేర్కొన్నారు.

దేవునిపల్లి యువ మున్నూరుకాపు సంఘం..

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి యువ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గా న్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ద్యావరి గణేష్, ఉపాధ్యక్షుడిగా నీలం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కోల శరత్‌కుమార్, కోశాధికారిగా భాను ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మికం..

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



పిట్లం(జుక్కల్): చిన్నకొడప్గల్ హనుమాన్ మందిర్‌లో శనివారం రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామ యువకుల ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలమాస పండగ



పిట్లం(జుక్కల్): కంబాపూర్, ధర్మారం, మార్దండ తదితర గ్రామాలలో ఆదివారం రైతులు, గ్రామస్తులు ఎలమాస(శూన్యం) పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు కుటుంబసమేతంగా ఉదయం పంటపొలాల వద్దకు చేరుకొని పండుగను జరుపుకున్నారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి పాడి పంటలు బాగా పండి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం వనభోజనాలు చేశారు.

ఇస్కాన్‌లో భగవద్గీత ప్రవచనాలు



కామారెడ్డి అర్బన్: స్థానిక ఇస్కాన్ కేంద్రంలో ఆదివారం భగవద్గీత సత్సంగం, ప్రవచనాలు, హరేకృష్ణ భజనలు చేశారు. హరేకృష్ణ మంగళహారతి దర్శనం అనంతరం అన్నప్రసాదం నిర్వహించారు. ప్రతి రోజు కనీసం ఒక భగవద్గీత శ్లోకం చదివే అలవాటు చేసుకోవాలని ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాస్ ప్రభు సూచించారు. పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నృత్యాలు చేశారు.

అన్నారం గట్టు మల్లన్నకు బోనాలు



రామారెడ్డి: అన్నారంలోని ప్రముఖ పురాతన ఆలయం గట్టు మల్లన్నకు ఆదివారం భక్తులు బోనాలు, గండ దీపాలు, ఎండ్ల బండ్ల ప్రదర్శన చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం, జాతర ఏర్పాటు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: పీఆర్‌టీయూ కామారెడ్డి జిల్లా శాఖ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అల్లాపూర్ కుషాల్, ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రతినిధులు పి.రాజనర్సింహారెడ్డి, రాజాగౌడ్, సంతోష్‌కుమార్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.